క్లుప్తంగా

సొసైటీలో స.హ. దరఖాస్తు



మాక్లూర్: సొసైటీ లావాదేవీల వివరాలను అందజేయాలని కోరుతూ ధర్మ సమాజ్‌పార్టీ నాయకుడు సీహెచ్ ప్రేమ్‌కుమార్ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు. మాక్లూర్ సొసైటీలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు నేపథ్యంలో గత సీజన్‌కు సంబంధించి వడ్ల కొనుగోలు, ఇతర లావాదేవీల పూర్తి వివరాలను అందజేయాలని సొసైటీ కార్యదర్శి సంతోష్‌ను కోరారు. దరఖాస్తు అందజేసిన వారిలో నాయకులు ఎస్ రమేశ్, భూమేశ్, శ్రీహరి, ఎస్ మోహన్ ఉన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సోమవారం నోట్‌పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల్లో సేవలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పట్వారి తులసీ కుమార్, కోశాధికారి, ప్రాజెక్టు చైర్మన్ లక్ష్మీనారాయణ, గోనె దామోదర్, ప్రవీణ్‌పవార్, ఆనంద్, హెచ్‌ఎం జగదీశ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఇన్‌చార్జీగా పుప్పాల శివరాజ్



ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల శివకుమార్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఇన్‌చార్జీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

మండల కమిటీల ఎన్నిక

బోధన్‌టౌన్(బోధన్): అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘాల బోధన్ మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐపీకేఎంఎస్ మండల అధ్యక్షుడు పడాల శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం బోధన్‌లో సమావేశం నిర్వహించారు. ఏఐపీకేఎస్ ఉపాధ్యక్షులుగా సీహెచ్ గంగయ్య, మొగులయ్య, ప్రధానకార్యదర్శిగా సుల్తాన్ సాయిలు, సహాయ కార్యదర్శులుగా పోశెట్టి, గోపాల్, కోశాధికారిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా డి.పోశెట్టి, బి.శంకర్, వి.లాలయ్య, ఆర్.దేవేందర్, బి.సాయిలు, సురేశ్, రాంరెడ్డి ఎన్నికయ్యారు.

ఏఐపీఎంఎస్ మండల కమిటీ

అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా గంగాధర్, ఎస్.భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా గంధం సీతారాం, సహాయ కార్యదర్శులుగా ఎండీ సలీం, ఎస్.బాలయ్య, కోశాధికారిగా గణపతి ఎన్నికైనట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్, కౌన్సిలర్లు శివలింగానికి అభిషేకం చేశారు. పల్లకీ సేవ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, మల్లయ్య, లక్ష్మణ్, మీనాచందు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ శివాలయంలో..

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని చక్రేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచన్‌పల్లికు చెందిన శ్రీకాంత్‌రెడ్డి కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ప్రధాన అర్చకుడు గణేశ్‌మహరాజ్, అర్చకులు మహేశ్, శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాస పూజోత్సవం..

బాల్కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాస పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గుర్తింపుకార్డులు అందజేత

వేల్పూర్: తహసీల్ కార్యాలయ సిబ్బందికి తహసీల్దార్ నాగార్జున గుర్తింపు కార్డులను అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణు, సీనియర్ అసిస్టెంట్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన్‌మార్గ్‌లో నిత్యం ప్రమాదాలు

- ఆర్మూర్‌లో ప్రమాదకరంగా ప్రధాన కూడలి
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటున్న పట్టణ ప్రజలు



ఆర్మూర్ పట్టణంలో హౌసింగ్ బోర్డుకు వెళ్లే దారి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జీవన్‌మార్గ్ ప్రధాన కూడలిలో ప్రతి రోజూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డు మీదుగా హౌసింగ్‌బోర్డులోని కళాశాలలు, పాఠశాలలకు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. హౌసింగ్‌బోర్డు వాసులు సైతం ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తారు. ట్రాఫిక్‌సమస్య, ప్రమాదాల కారణంగా పట్టణ వాసులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్నారు. ఇటీవల ఓ వాహనం మితిమీరిన వేగంతో దూసుకువచ్చి చిన్నారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారికి గాయాలయ్యాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యా సంస్థలకు విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలోనే కొంతమంది యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ అటు విద్యార్థులను, ఇటు ప్రజలను భయందోళనకు గురి చేస్తున్నారు. సమీపంలో పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ యువత భయపడకుండా ఇష్టారీతిన వాహనాలు నడపుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భయంగా ఉంది

జీవన్‌మార్గ్‌లోని ప్రీమియర్ బార్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు, పాదచారులు రోడ్డు దాటలంటే భయపడుతున్నారు. వెంటనే అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి.

– జె.శ్రీధర్, ఆర్మూర్

అధికారులు స్పందించాలి

రోడ్డు వేయడంతో వాహనాల తాకిడి పెరిగింది. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు, వాహనాల వేగం నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలి.

– పి.సుభాష్, ఆర్మూర్

సాంకేతికతతోనే నూతన ఆవిష్కరణలు

- జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్



ప్రదర్శనను తిలకిస్తున్న సైన్స్ అధికారి గంగాకిషన్

బోధన్‌టౌన్(బోధన్): సాంకేతికతతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ అన్నారు. పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ల్యాబ్ వార్షికోత్సవాన్ని మండల విద్యాధికారి నాగ్‌నాథ్ ప్రారంభించారు. విద్యార్థులు నూతన ఆలోచనలతో చేసిన ఇన్నోవేంటర్స్, ఇన్నోవేటర్స్, హర్సిన్ బర్గ్, స్టీఫెన్ హెవే కీన్స్, సీవీ రామన్, మైక్రోమైండ్స్, న్యూటన్ టెక్నాలజీ ఐడియాస్ డెవలపర్స్, ఏపీజే అబ్దుల్ కలాం, స్మార్ట్ డస్ట్‌బిన్, స్మోక్ డిటెక్టివ్ తదితర 18 అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతోపాటు సైన్స్ జిల్లా అధికారి ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ.. సాంకేతికరంగాల్లో అభివృద్ధి సాధించామని, నూతన ఆవిష్కరణలతో మరింత ముందుకు సాగాలని, విద్యార్థులు తమ మేధస్సుకు పని కల్పించాలని సూచించారు. హెచ్‌ఎం కృష్ణమోహన్, ఐఆర్ చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద స్కూల్‌లో వైద్యశిబిరం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీవేద హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో సోమవారం కంటి, దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి, లైఫ్ కేర్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు, కంటి మందులు, బ్రష్‌లు, పేస్ట్‌ను అందజేశారు. దంత, కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. వైద్యులు ఇర్ఫాన్ అలీ, సతీశ్, స్కూల్ ప్రిన్సిపల్ అక్షర, డైరెక్టర్ తెల్ల రవికుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షుడు హనుమంతరావ్, కప్ప సంతోష్, రాజు, యోగేశ్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కో ఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి



బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కో – ఆర్డినేటర్‌గా దొడ్ల రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీపీవైసీసీ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బాధ్యతతో పనిచేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

బోధన పరికరాలతో గుణాత్మక విద్య



బోధన పరికరాలను ప్రదర్శిస్తున్న టీచర్లు

వేల్పూర్: విద్యార్థులకు బోధన పరికరాల ద్వారా గుణాత్మక విద్యను అందించవచ్చని వేల్పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రాథమిక ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థిగా ఉండాలన్నారు. మండల రీసోర్స్ పర్సన్లు అంకం నరేశ్, సయ్యద్ బాసిద్ మాట్లాడుతూ.. తొలిమెట్టు కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి బోధన పరికరాలు తయారు చేసి ప్రదర్శించారు.

హెల్మెట్ ధరించాలి



ఆర్మూర్‌టౌన్: ద్విచక్ర వాహనదారురులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో వాహదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. ఎస్సై అంజమ్మ, పోలీస్ సిబ్బంది, వాహనాదారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలపై అవగాహన



కూనేపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రమోదిత

రెంజల్(బోధన్): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కూనేపల్లిలో రెంజల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యాధికారిణి ప్రమోదిత మాట్లాడుతూ.. అవయవాలకు వేర్వేరు లక్షణాలతో పెరిగే పుండు, కణతి, గడ్డలతోపాటు ఆడవారిలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. వీటితోపాటు బోన్ క్యాన్సర్, ప్రొస్టేట్, ఊపిరితిత్తులు వంటి క్యాన్సర్లబారిన పడినప్పుడు బరువు తగ్గడం, నీరసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచూ జ్వరం తదితర లక్షణాలు ఉంటాయని వివరించారు. నిషేధిత తంబాకు ఉత్పత్తుల కారణంగా నోటి, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యవిస్తర్ణ అధికారి రవీందర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గాలకు సన్మానం



సర్పంచులతో మోస్రా ఎంపీపీ ఉమాశ్రీరాములు



మాక్లూర్ మండలం కల్లెడిలో..

వర్ని/మాక్లూర్: పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులను మోస్రా ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, కల్లెడి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను మాక్లూర్ ఎంపీడీవో జె క్రాంతి సోమవారం ఘనంగా సన్మానించారు. మోస్రాలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, రైతు నాయకుడు పిట్ల శ్రీరాములు, తహసీల్దార్ శ్రీకాంత్‌రావు,ఎంపీడీవో భారతి, కో ఆప్షన్ సభ్యుడు ఫెరోజ్, ఆర్‌ఐ సాయిలు పాల్గొన్నారు కల్లెడిలో ఉప సర్పంచ్ మనీశ్‌గౌడ్‌తో పాటు మాచర్ల రమేశ్, చిన్నరామ్, సుక్కి సుజాత, అనిల్, రాజు, సుధాకర్, మల్లేశ్, మాజీ సర్పంచ్ బసెట్టి సుమలత శ్రావణ్ పాల్గొన్నారు.

జీవో 60ప్రకారం వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సుధాకర్

బోధన్‌టౌన్(బోధన్): జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్‌ఎంవో రహీంకు కార్మికుల సమస్యలపై విన్నవించారు. కార్మికులకు పనిభారం తగ్గించాలని కోరారు. సమావేశంలో నాగమణి, దత్తు, మహబూబ్, సతీశ్, సాయిలు, అనీల్, హన్మాండ్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

ఆర్మూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న విమర్శించారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఈ నెల 16వ తేదీన దేశ వ్యాప్తంగా బంద్‌ను నిర్వహించాలని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్ సంఘాలు నిర్ణయం తీసుకున్నాయన్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గుండారం సాయిరెడ్డి, రవి, అఫ్జల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో ప్రత్యేకత చాటాలి



మాట్లాడుతున్న బోధన్ ఆర్డీవో రాజాగౌడ్



మాట్లాడుతున్న ఆర్మూర్ డీఎల్పీవో శ్రీనివాస్

బోధన్‌రూరల్(బోధన్): ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకతను చాటాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు పంచాయతీ చట్టాలపై అవగాహన పెంచుకుని సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో పారదర్శకత పాటించాలన్నారు. రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సమస్యలపై అవగాహన పెంచుకుని క్షేత్రస్థాయిల్లో పరిశీలన చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. డీఎల్‌పీవో గౌసుద్దీన్, ప్రత్యేక శిక్షణాధికారి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

పెర్కిట్(ఆర్మూర్): గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో సోమవారం ఆర్మూర్ డివిజన్‌లోని ప్రత్యేక అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అలాగే పారిశుధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగేలా పర్యవేక్షించాలన్నారు. దీంతోపాటు పల్లె ప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పనులు సజావుగా సాగేలా చూడాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు జారీ చేయాలి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో వీఆర్‌ఏలు

కమ్మర్‌పల్లి: 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు అర్హతను బట్టి ఉద్యోగ నియామక ఉత్తర్వులను జారీ చేయాలని కమ్మర్‌పల్లి మండల వీఆర్‌ఏలు కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీని వీఆర్‌ఏలు కలిశారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏల వారసులను విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్ క్యాడర్ నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఉత్తర్వులు ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ నియామక ఉత్తర్వులు జారీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్సీకి విన్నవించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సజ్జు, శంకర్, శ్రీనివాస్, మూర్తి తదితరులున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

బాల్కొండ: క్రీడాల్లో గెలుపోటములు సహజమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. యువయూత్ ఆధ్వర్యంలో మెండోరాలో నిర్వహించిన బుట్టడి వినోద్ స్మారక కబడ్డీ, వాలీబాల్ టోర్నీ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, మోహన్‌రెడ్డి హాజరై విన్నర్, రన్నర్ జట్లకు కప్‌లు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కబడ్డీ విజేతగా మోర్తాడ్ మండలం తాళ్లారాంపూర్, రన్నర్‌గా సుర్బిర్యాల్, వాలీబాల్ విజేతగా కోరుట్ల, రన్నర్‌గా తాడ్వాయి నిలిచాయి.

సమాజ సేవకు ముందుకురావాలి



బోధన్‌టౌన్(బోధన్): సమాజ సేవకు యువతతో పాటు మానవతావాదులు ముందుకు రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించగా, 150 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ఆరోగ్య జ్యోతి, సీవ వీరయ్య, సునీల్‌కుమార్ చౌదరి, సుధాకర్, శైలేందర్, రహీం, నాయకులు గాంధీ, బుజ్జి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ



రెంజల్(బోధన్): కరీంనగర్‌లో నిర్వహించిన అండర్ – 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 76 కిలోల విభాగంలో రెంజల్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని మాలతి మూడో స్థానంలో నిలిచింది. మాలతిని ప్రిన్సిపల్, పీడీ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న మాలతి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ బలరాం, పీడీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీ ఎండింగ్ – 12.05, 6.20 బూట్‌కట్ బాలరాజు (తెలుగు) – 3.15 ధీర (తెలుగు) – 9.30
స్క్రీన్-2 –	హనుమాన్ (తెలుగు) – 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు– 10.35, 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	ధీర (తెలుగు) – 01.20 కిస్మత్ (తెలుగు) – 4.00, 9.50 గేమ్ ఆన్ (తెలుగు) – 6.50

సంక్షిప్తం

అట్టముక్కలతో అయోధ్య రామాలయం



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన గున్నాల హర్షిత్ అట్టముక్కలతో అయోధ్య రామాలయాని రూపొందించి అబ్బురపరిచాడు. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న హర్షిత్ చంద్రయాన్ నమూనాను సైతం తయారు చేశాడు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): వంజరి సంఘం క్యాలెండర్‌ను ఆలూర్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు నవాతే గంగాధర్, కోశాధికారి నవాతే శ్రీనివాస్, ఆమందు సంజీవ్, కొరికే అశోక్, కే చిన్న గంగారాం, రవీందర్, రమేశ్, లక్ష్మీనారాయణ, యోగేశ్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తపరీక్షలు

బాల్కొండ: వైద్యశాఖ ఆధ్వర్యంలో ముప్కాల్ మండల కేంద్రంలో స్థానికులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, హెచ్‌బీ నిర్ధారణ కోసం రక్త నమూనాలను సేకరించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సభ్యులు వెంకట్, విజయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కళాబృందం ప్రదర్శన

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంతోపాటు బజార్‌కొత్తూర్‌లో నాబార్డ్ న్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైతన్య కళాబృందం సైబర్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు తమ ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేశారు.

సీఐకి సన్మానం

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌రెడ్డి మండల కాంగ్రెస్ సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్, ఐసూబ్, దమ్మాయి శ్రీను, ఎడ్డిగారి నిఖిల్, పీరాజీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

సమాచారం అందించాలి

ఆర్మూర్‌టౌన్: వేధింపులు,ఈవ్‌టీజింగ్ బారినపడితే మహిళలు, యువతులు వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని షీటీం కానిస్టేబుళ్లు విఘ్నేశ్, సుమతి సూచించారు. ఆర్మూర్‌పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో షీటీం, సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం ఫొటో ఏర్పాటు చేయాలి

రుద్రూర్: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామ పంచాయతీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సీఎం ఫొటోను పంచాయతీ కార్యదర్శి శ్రీవాణికి అందజేశారు. మహ్మద్ ఖాన్, మోహిన్, యసూఫ్, సాయి, బాలరాం, మతిన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.